72

# చచ్చులూ, పుచ్చులూ...

మంగళగిరిలో ఉన్న నరసింహస్వామిని పానకాల నరసింహస్వామివారని అంటారు. మిగిలిన నరసింహయ్యలకు, ఈ నరసింహయ్యకూ చాలా తేడాలున్నాయి. మిగిలిన వారు ఇచ్చిందంతా తీసుకుంటారు. ఈ స్వామివారు, తమకు వచ్చిందాంట్లో సగం తీసుకొని, మిగిలిన సగం బయటికి కక్కేస్తుంటారు. ఇది అన్ని విషయాల్లోనూ కాకపోవచ్చుగానీ పానకం విషయంలో మాత్రం నిజం! మనం గిన్నెడు పానకం పోస్తే సగం తాగి, మిగతా సగం కక్కేస్తారు. మనం వంద బిందెలు పోస్తే 50 బిందెలు తాగి మిగిలిన 50 బిందెల్నూ కక్కేస్తారు స్వామివారు.

దీన్నే ఇంకో రకంగా చెప్పాలంటే, స్వామివారి దాహం ఎప్పుడూ సగమే తీర్చగలుగుతాం గానీ, పూర్తిగా కాదూ - అని! అంటే స్వామి వారు ఎప్పుడూ దాహంతో మక మకలాడుతూ ఉంటారు - అని! ఈ దాహం తీరేది కాదు. మరొకరూ, మరొకరూ తీర్చగలిగిందీ కాదు. ఎన్ని శతాబ్దాల నుండో ఈ కార్యక్రమం అవిచ్ఛిన్నంగా జరిగిపోతూ ఉంది. ఇక ముందెన్ని శతాబ్దాలు జరుగుతుందో మనం చెప్పకోలేము.

“వేంకటేశ్రావు కూడా ఇసుమంటి వాడేనండీ!” అన్నాడు యాదగిరి బిరబిరలాడిపోతూ.

అతని బిరబిరలకు చాలా కారణాలున్నాయి. యాదగిరి పూర్వీకులది ఖమ్మం జిల్లాలోని సత్తుపల్లి దగ్గరున్న వో చిన్న గ్రామం. అప్పుడెప్పుడో వారికి కొంత భూమి కూడా ఉంది. ఆ భూమిని సాగు చేదామనుకున్నాడు. అప్పుచేసి దున్నపోతుల్ని కొన్నాడు. జతపోతులూ ఆ రోజుల్లోనలభయి ఎనిమిది రూపాయలు. అదేం దురదృష్టమోగానీ, పోశయ్య అరక కట్టిన మూడేళ్లూ, చిట్టుమని వానలేదు. అథవా అడపాదడపా వానలు పడినా, గరపనేల కనుక, చినుకులన్నీ ఇంకిపోయాయి.. విత్తనాలకూ, గొడ్లమేతకూ, పొట్టకూ, బట్టకూ అప్పులు చేశాడు. పోశయ్య దున్నపోతుకోసం చేసిందీ, ఈ అవసరాలకోసం చేసిందీ కలిపితే బాకీలు పోశయ్య పీకదాకా వచ్చాయి. అడిగీ, అడక్క ముందే, అప్పులిచ్చిన ‘దొర’ ఇంక అప్పులివ్వడం మానేయడమే కాకుండా, పోశయ్య మళ్ళీ అప్పుచేసి, వ్యవసాయం చేసి నష్టపోతాడేమోనన్న జాలికొద్దీ, ఆ పొలాన్ని అతన్నుంచి తీసేసుకున్నాడు. అలా తీసుకొని చూసినా ఇంకా బోలెడంత బాకీ మిగిలిపోయింది.

వెంకటేశ్వరరావు తండ్రి- వెంకటేశ్వరరావు కన్నా మంచి వాడు గనుక, ఆ బాకీని చాకిరి చేసి తీర్చుకోమని చెప్పాడు. పోశయ్య ‘సరే’ నన్నాడు. ఆ బాకీని రద్దు చేయడం కోసం పోషయ్య చచ్చిందాకా వెట్టి చేస్తూనే ఉన్నాడు. పోశయ్య చనిపోయాడు. ఆ పిత్రార్జితం యాదగిరికి లభించింది. యాదగిరి కూడా చాలా సంవత్సరాలు దాదాపుగా యాభయ్ సంవత్సరాలు కిక్కురుమనకుండా చేశాడు.

ఈలోగా వెంకటేశ్వరరావు తండ్రి చచ్చిపోయాడు. అయినా యాదగిరి తండ్రి చేసిన బాకీ చావలేదు.

“అదేం అప్పో అదేం పాడో, నాకెరికలేద్దొరా! మేం సచ్చినం! సస్తున్నం. అడిగేటోడికి కాలం మూడె అసలు ముచ్చటెత్తడానికి దమ్ము లెవడికున్నయ్యండి!” అన్నాడు యాదగిరి ఆ రోజుల్ని తలుచుకొంటూ.

అతను పొద్దున్నే దొరగారింటికి పోయేవాడు. నీళ్ళు తోడిపోసేవాడు. పొన్నలు తొక్కేవాడు. దొర తిరిగిన చోటికల్లా వెనకెనక తిరిగేవాడు. ఎవర్ని పిలవమంటే వారిని పిలుచుకొచ్చేవాడు. ఎవర్ని కొట్టమంటే వారిని చావబాదేవాడు. మళ్ళీ సాయంకాలం, లాంతర్లు, దీపాలు తుడవడం, గాస్‌నూనె పోయడం, దీపాలు ముట్టించడం, కంచాలు కడగడం, పక్క వేయడం, దొరకు నిద్రపట్టే దాకా కాళ్ళు వొత్తడం ఈలోగా దొరకు, వొకసారి రెండుసార్లో స్నానం చేయించడం. ఈ పనులన్నీ యాదగిరి చేసేవాడు. ఈ పనులు చేసినందుగ్గాను తిట్లు, బూతులు, తన్నులు, దెబ్బలు, అవమానాలు గాక కుండెడు గింజలు ఇచ్చేవాడు దొర. అదయినా తాలూ తప్పా, పొల్లూ నెల్లూను.

'ఇంత తక్కువా?' అనడానికి లేదు. అసలు ఎంతో కొంత ఇస్తున్నందుకు సంతోషించాలి. పాత బాకి గాక, తన పెళ్ళికి మరికొంత బాకి చేశాడు యాదగిరి. దాంతో యాదగిరి భార్య కూడా వెట్టి చేయాల్సి వొచ్చింది.

"ఇక మా జనమలు ఇంతేననుకున్నమండీ! మేం ఇందుకోసమే పుట్టినోళ్ళమనుకున్నాం. యెంగలరావు దొర సీటు మీన కొచ్చిండు... మా బాధ ఇరగడయింది!" అన్నాడు యాదగిరి.

అంతకుముందు స్థానికంగా ఉన్న కొంతమంది రాజకీయవాదులు, ఇక్కడి కట్టుబానిసల విముక్తి కోసం అందోళనలు జరిపారు. కాని వెంకటేశ్వరరావు తెలివైనవాడు. బలం, ధనం ఉన్నవాడు. తన డబ్బుతో అధికారుల్నీ, రాజకీయవాదుల్నీ ఆకట్టుకొన్నాడు. ఏ గ్రూపు అధికారంలో ఉంటే, ఆ గ్రూపులో కలిసిపోయేవాడు వెంకటేశ్వరరావు! ఇక ఎవరు మాత్రం చేయగలిగిందేముంది?

వెట్టి చాకిరి నిర్మూలనమన్నది, నినాద దశను దాటి, ఆచరణలో పెట్టక తప్పనిదశ వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం, తీవ్రంగా కృషి చేసింది. కలెక్టర్లు, ఇతర అధికార్లకు విశేషాధికారాలనిచ్చింది. ఫలితంగా విముక్తి పొందిన వందలాది 'బాండెడ్ లేబర్స్'లో యాదగిరి, అతని భార్య సత్తెమ్మ కూడా ఉన్నారు.

'బానిసత్వం' నుండి బయటపడ్డా బతికే మార్గం కనిపించలేదు. అప్పట్లో ఖమ్మం జిల్లా కలెక్టరుగా పనిచేసిన పి.వి.ఆర్.కె.ప్రసాద్ వీరి పునరావాసానికి విశేషంగా పాటుపడ్డారు. నాగార్జున గ్రామీణ బ్యాంకు వారు, యాదగిరికి మూడు వందల రూపాయల రుణ సదుపాయం కల్పించారు. "దాంతో కూరగాయల బండి పెట్టిన... కొనటం, అమ్మడం తెలవదు. మాయతూకం తూసినాకిచ్చేటోల్లు. నాకేమో ఆ రాల్లు, దలాలు తెలియదాయే, నష్టమొచ్చింది. సద్దామనుకొంటే ముసిల్ది ధైర్యం చెప్పె. అట్టనే బండి నెట్టుకొత్తంటి దొరా!"

యాదగిరి కూరగాయలు తూచి, తట్టలోపోస్తే సత్తెమ్మ ఇళ్ళ దాకా తీసుకొచ్చి ఇచ్చిపోతుంది. కరెక్టుగా తూస్తాడు. ఎదటి వారికన్నా వో పైసా తక్కువకే ఇస్తాడు. యాదగిరికి పిల్లల్లేరు.

"ఈ దరిద్దరం, మాతోనే ఆఖరు కానియ్యండి దొరా! ఇంకా పిల్లపిల్లతరాలు ఎందుకులెండి?" అన్నాడు యాదగిరి బాధగా.

అన్నాడుగానీ, పిల్లలు లేరన్న బాధ అతన్ని లోలోపలే తొలిచి వేస్తూనే ఉండి ఉండాలి. ఈ మాటలంటున్నప్పుడే, అటుగా స్కూలుకు పోతున్న ఎనిమిదేళ్ళ అమ్మాయికి, ముగ్గ పండిన టొమాటో పండునిచ్చి, బుగ్గలు నిమిరాడు యాదగిరి.

"మంచియన్నీ మందికమ్ముతా, చచ్చులూ పుచ్చులూ మాకుంటయ్" అన్నాడు యాదగిరి కూరలు తూచి, భార్య పట్టుకున్న పల్లికల్లో వేస్తూ.